www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
మంగళవారం | 04 | ఆగస్టు | 2026 | పేజీలు: 08



## అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, అక్షిత బ్యూరో:** ప్రజా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలోని మీటింగ్ హాల్ నందు జిల్లా నలుమూల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు ఫిర్యాదులను స్వీకరించారు. అందులో భూభారతి 14, పెన్షన్లు 7, హౌసింగ్ 6 , ఇతర 30 , మొత్తం 57 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠం

### అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**కరీంనగర్, అక్షిత బ్యూరో:** తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ అన్నారు. ఈనెల 7 వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గ్రామస్థాయిలో గర్భిణీలు బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని ప్రతి ఒక్కరికి తెలియజేయాలని, ముర్రుపాల లోని రోగనిరోధక శక్తి వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతాడని తెలిపారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను సందర్శించి అక్కడి గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యంపై కౌన్సిలింగ్ నిర్వహించాలని ..మిగతా 2లో

# రామప్ప సరే.. కాకతీయ మాటేంటి?

### చారిత్రక సంపదను పరిరక్షించుకుందాం

### కాకతీయ వైభవానికి కేంద్రం పెద్దపీట వేయాలి

### వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి:** వరంగల్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కాకతీయ వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి అంశాన్ని లోక్‌సభ వేదికగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బలంగా ప్రశ్నించారు. ప్రధానంగా వరంగల్‌కు చరిత్రక గుర్తింపుగా నిలిచిన కాకతీయ కట్టడాలు, సంప్రదాయ కళలు, చేనేత-హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాలు, పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గత మూడేళ్లలో ఎలాంటి చర్యలు తీసుకుందో వివరించాలని ఎంపీ కోరారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సమాధానం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిధిలో 9 రక్షిత కట్టడాలు ఉన్నాయని, వాటిలో వరంగల్ జిల్లాకు చెందిన కాకతీయ వారసత్వ కట్టడాలు కూడా ఉన్నాయని తెలిపారు. అవసరాలు, నిధుల లభ్యత మేరకు వాటి పరిరక్షణ, నిర్వహణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, కాకతీయ కళా సంపద, చేనేత, హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాల అభివృద్ధికి ఇంకా విస్తృత ..మిగతా 2లో

## చెరువులు నిండితే భూగర్భ జలాలు వృద్ధి

### ముందుగా చెరువులు నింపుకోండి

### ఆరుతడి పంటలు మేలు

### కొత్త పనులను 3 నెలల్లో పూర్తి చేయాలి

### ఇందిరమ్మ ఇండ్ల ఫైనల్ బిల్స్ కచ్చితంగా ఇస్తాం

### కేంద్రం నిధులు ఇవ్వకపోవడమే కాస్త జాప్యం

### సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి




**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** భీమా ఫేస్ 2 నుండి వచ్చే నీటి ద్వారా మన గ్రామాల చెరువులను నింపుకోవాలని ఆ విషయంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రత్యేక ..మిగతా 2లో

## పేదింటి ఆత్మగౌరవం.. ఇళ్లు

### ఫీల్డ్ పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత




**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో :** నిరుపేదల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం 2వ విడత గృహ నిర్మాణ పనులు, లబ్ధిదారుల డెస్క్ పరిశీలన, ఫీల్డ్ పరిశీలన ప్రక్రియలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు అధికారి ప్రకాష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సంబంధిత అధికారులతో ..మిగతా 2లో

## రామప్ప సరే కాకతీయ మాటేంటి?

మొదటి పేజీ తరువాయి...



స్థాయిలో చర్యలు అవసరమని అన్నారు. హెరిటేజ్ సిటీగా వరంగల్‌కు గుర్తింపు లభించినప్పటికీ, నగరంలోని చారిత్రక కట్టడాల అభివృద్ధి పనులు మరింత వేగవంతం కావాలని డా. కడియం కావ్య అభిప్రాయపడ్డారు. వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి వద్ద ప్రపంచ స్థాయి పర్యాటక సదుపాయాలు కల్పిస్తే వేలాది మంది దేశ, విదేశీ పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రసాద్ పథకం కింద రామప్ప దేవాలయ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, కాకతీయ వారసత్వానికి సంబంధించిన అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను కేంద్రం రూపొందించాలన్నారు.

## తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠం

మొదటి పేజీ తరువాయి...

సూచించారు. పుట్టినప్పటి నుండి ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని, రెండు సంవత్సరాల వరకు కొనసాగించాలనే విషయాన్ని తెలియజేయాలన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధుల సహకారంతో అవగాహన సమావేశ ఏర్పాటు చేసి తల్లిపాల ప్రాముఖ్యం వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఐసిడిఎస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పేదింటి ఆత్మగౌరవం..ఇళ్లు




మొదటి పేజీ తరువాయి...

సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం 2వ విడతలో లబ్దిదారుల డెస్క్ పరిశీలన ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 10లోపు, కెరమెరి మండలంలో 13 మాత్రమే పెండింగ్‌లో ఉన్నందున మంగళవారం నాటికి డెస్క్ పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. సిర్పూర్-టి, కౌటాల, బెజ్జూర్, పెంచికల్‌పేట్, వాంకిడి, లింగాపూర్, రెబ్బెన తదితర మండలాలలో 100 కంటే తక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నందున శనివారం సాయంత్రంలోగా తప్పనిసరిగా పరిశీలన పూర్తి చేయాలని తెలిపారు. జాబితాలో లేని అర్హులైన హట్ డ్వెల్లర్స్ ఎవరైనా ఉన్నట్లయితే, వారి వివరాలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సేకరించి, ఫోటోలతో సహా నిర్దేశిత ఆన్‌లైన్ ప్లాట్‌ఫారంలో నమోదు చేయాలని తెలిపారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలలో లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజావాణిలో అందిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ పరిశీలించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన 500 రూఫ్ రీప్లేస్‌మెంట్ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని, గోడలు బాగుండి, కేవలం పైకప్పు మార్పిడి అవసరమున్న ఇళ్లను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం ఆర్.సి. లెవల్‌లో ఉన్న 2 వేల 712 గృహాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, జైనూర్ మండలంలో 369 ఇళ్లు, కాగజ్‌నగర్, కెరమెరి ప్రాంతాలలో అధిక సంఖ్యలో నిర్మాణాలు కొనసాగుతున్నందున ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. బిల్లుల చెల్లింపుల విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదని, ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో విడుదలవుతాయని, ఈ విషయంపై గుత్తేదారులు, లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణ పనులను వేగవంతంగా పూ ర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డెస్క్ పరిశీలన, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, తప్పుడు వివరాలకు అవకాశం లేకుండా ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి నివేదికలను సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సహాయ ఇంజనీర్లు (ఏఈలు), ఏపీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**తాగేడు మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశం**

**ప్రోటోకాల్, జాతీయ పతాకావిష్కరణ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచన**

**తాగునీరు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, సాంస్కృతిక కార్యక్రమాలు, సంక్షేమ పథకాల స్టాల్స్ ఏర్పాటుకు ఆదేశాలు**




ములుగు, అక్షిత ప్రతినిధి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్ జీ, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని తాగేడు మైదానంలో వేదిక నిర్మాణం, ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాటు, పబ్లిక్ అడ్రస్ సిస్టం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా అనుసరించాల్సిన అన్ని మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పబ్లిక్ అడ్రస్ సిస్టం పనితీరును ముందస్తుగా పరీక్షించాలని, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రతిబింబించే స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులకు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను సమకూర్చాలని తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బందితో కలిసి తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి, ఎస్‌డీసీ ప్రతాప్, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్**

**ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 60**

జగిత్యాల అక్షితబ్యూరో: ప్రజావాణి అర్జీలపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన






జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు, కాగా ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 60 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం బ్రహ్మ కుమారీస్ వారి ఆధ్వర్యంలో 10 కోట్ల మంది వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. జిల్లా సంక్షేమ శాఖ వారి తల్లిపాల వారోత్సవాల పోస్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ వారి తెలంగాణ జలసిరి (ఎల్ నినో ప్రభావం - వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొందాం ) పోస్టర్ లను ఆవిష్కరణ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బి.ఎస్ లత, బి.రాజ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# వరుస ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పట్టుకున్న

**వరంగల్ సిసిఎస్ కేయూసి పోలీసులు**

**మొత్తం 28 మోటార్ సైకిళ్ల స్వాధీనం, విలువ రూ. 25 లక్షలు**



వరంగల్, అక్షిత బ్యూరో: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న ద్విచక్ర వాహనాల చోరీలపై సంబంధిత పోలీస్ స్టేషన్ లలోహోకేసులు నమోదుకాగా బైక్ చోరీలు చైన్ స్నాచింగ్ కేసులకు కూడా దారి తీస్తునందుకు సెంట్రల్ జోన్ డిసిపి కవిత ఆధ్వర్యంలో స్పెషల్ టీం లను నియమించారని. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ప్రత్యేక దృష్టి సారించి నేర విచారణ చేయడం జరిగిందని. గత కొద్ది కాలంగా జరిగిన నేరాలను విశ్లేషణ చేయగా, సోమవారం ఇద్దరు అనుమానితులను అదుపులోనికి తీసుకోని విచారణ చేయగా బైక్ చోరీలకు సంబంధించి కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయని దొంతుల ప్రశాంత్ కుమార్ (20), నివాసం: పి.కె. రాజయ్య కాలనీ, ఇందిరమ్మ కాలనీ, ఎన్‌టీపీసీ, మంచిర్యాల మరియు దుర్గం సాయి కార్తిక్ (21), నివాసం: వేలాల గ్రామం, జైపూర్ మండలం, మంచిర్యాల జిల్లా. వీరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

ప్రజలు తమ వాహనాలను భద్రంగా పార్కింగ్ చేసి, స్టీరింగ్/వీల్ లాక్స్ వంటి అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నామనీపై వరుస వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన, సిసిఎస్ సిబ్బందిని సిపి అభినందించారు.

ఈ మీడియా సమావేశంలో హన్మకొండ, సిసిఎస్ ఏసీపీ లు నర్సింహారావు, సదయ్య పాల్గొన్నారు.

# నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్

**నిర్మల్, అక్షిత ప్రతినిధి:** పోలీస్ స్టేషన్ రికార్డులు, కేసుల పురోగతి, సిబ్బంది పనితీరుపై సమీక్ష ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించాలని అధికారులకు ఆదేశం నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.



ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, రికార్డు రూమ్‌తో పాటు స్టేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేసి, నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కార తీరును సమీక్షించారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తును నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరంగా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిర్మల్ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నేరాల నివారణకు పెట్రోలింగ్‌ను మరింత పటిష్టం చేయాలని తెలిపారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.



ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా మిత్ర పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, నిర్మల్ టౌన్ సీఐ సమ్మయ్య, ఎస్ఐలు మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో

# ఉచిత మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్ పంపిణీ

**వికారాబాద్ :అక్షిత బ్యూరో:** ప్రభుత్వం దివ్యాంగుల ఆర్థిక స్వావలంబన, సాధికారతను ప్రోత్సహించే లక్ష్యంతో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్ వాహనాని ఈ రోజు పంపిణీ చేసింది.

ఈ కార్యక్రమంలో భాగంగా యాలాల్ మండలం, అన్నసాగర్ గ్రామానికి చెందిన దివ్యాంగ లబ్ధిదారుడు శ్రీ కర్రె అశోక్ గారికి జిల్లా కలెక్టర్ ఓ జిల్లా మేజిస్ట్రేట్ చేతుల మీదుగా ఉచిత మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్ వాహనాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీ. కాంతారావు (దివ్యాంగుల సంక్షేమ శాఖ) తదితరులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా లబ్ధిదారుడు శ్రీ కర్రె అశోక్ ప్రభుత్వం అందించిన ఉచిత మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్ వాహనాన్ని అందుకున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఓ జిల్లా మేజిస్ట్రేట్ మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ వాహనాన్ని స్వయం ఉపాధి కోసం వినియోగించి తన కుటుంబ ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపరుచుకుంటానని పేర్కొన్నారు.

## మాజీ మంత్రి ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సుభాష్ సెంటర్‌లో మాజీ మంత్రి, రామన్నపేట మాజీ శాసనసభ్యులు ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి, 13వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప ప్రజానాయకుడని, ప్రజల మన్ననలు పొందిన నాయకుడిగా చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన అందించిన సేవలు



చిరస్మరణీయమని కొనియాడుతూ, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోటే రమేష్, మొహమ్మద్ నాసర్, వనం విఠల్, వనం నరసింహ, సాల్వేర్ అశోక్, వనం చంద్రశేఖర్, గోదాసు శ్రీమన్నారాయణ, కేశవదాస్ వెంకటేశం, రాపోలు రాజశేఖర్, సైదాచారి, మొహమ్మద్ జానీ, ఆముద లక్ష్మణ్, రాఘవుల అనంతకుమార్, ఎర్ర నరసింహ, కొమ్ము నాగరాజు, గురజాల మహేష్ రెడ్డి, మేడి రాములు, లవణం ఉపేందర్, మేడి శంకరయ్య, మొహమ్మద్ అజార్, చొల్లేటి పాండురంగాచారి, బొడ్డు సైదులు, మాధవరావు సింధియా, మేడి ధృవ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌కు సీసీ రోడ్డు వెంటనే నిర్మించాలి

### ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఇరిగి వరుణ్ తేజ్



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలంలోని మోడల్ స్కూల్ నుండి చౌటుప్పల్ హైవే వరకు సీసీ రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ చౌటుప్పల్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఆదర్శ పాఠశాల వరకు సిసి రోడ్డు నిర్మాణం చేయాలని కోరుతూ సోమవారం ఉదయం పాఠశాల ముందు విద్యార్థులతో కలిసి నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ… ఎమ్మెల్యే రెండుసార్లు ప్రత్యక్షంగా మోడల్ స్కూల్‌ను పరిశీలించినప్పటికీ ఇప్పటి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడం విచారకరమన్నారు.కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను సంబంధిత అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.

ముఖ్యంగా వర్షాకాలంలో మట్టి రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి విద్యార్థులు జారి పడే ప్రమాదం ఏర్పడుతోందని, ప్రతిరోజూ సైకిళ్లపై పాఠశాలకు వచ్చే విద్యార్థులు వెళ్లడం తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. ఈ రహదారి విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారినప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు.కాబట్టి అధికారులు మొండి నిద్ర వీడి, ఎమ్మెల్యే ఇచ్చిన హామీని అమలు చేస్తూ మోడల్ స్కూల్ నుండి చౌటుప్పల్ హైవే వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేసారు . లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి మరింత ఉధృతంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు ఇరిగి వరుణ్ తేజ్ మండల నాయకుల పోలేపల్లి మల్లేష్, సర్వే అరవింద్, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్ లో యూనిఫామ్ అందజేత

### హాజరైన కౌన్సిలర్ తిరుపతయ్య



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని నాల్గవ వార్డు పరిధిలోగల అంగన్వాడి-2 సెంటర్ లో ఆ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఎరుకలి తిరుపతయ్య పాల్గొని అంగన్వాడి చిన్నారులకు ప్రభుత్వ పరంగా మంజూరైన యూనిఫామ్ డ్రెస్సులను అందజేశారు. ఈ సందర్భంగా నాల్గవ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఎరుకలి తిరుపతయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేద కుటుంబాల కోసం అంగన్వాడి సెంటర్లను ఏర్పాటు చేశారని 3 సంవత్సరాల వయసు గల చిన్నారులకు అంగన్వాడి సెంటర్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న విద్యతోపాటు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆరెస్ నాయకులు శ్రీను, అంగన్వాడి టీచర్ ప్రసన్న, బీజేపీ నాయకులు యాదిరెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# బలమైన భవిష్యత్తుకు తల్లిపాలే పునాది

## ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**మెదక్ అక్షిత బ్యూరో:** ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలని

కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ఉత్సవాల పోస్టర్స్‌ను అదనపు కలెక్టర్ నగేష్ తో కలసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి తల్లి తన బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే తల్లిపాలు అందించాలని తెలిపారు. తల్లిపాలు శిశువుకు సురక్షితమైనవి, స్వచ్ఛమైనవి, పోషక విలువలు కలిగినవని, శిశువు ఆరోగ్యవంతంగా ఎదగడానికి తల్లిపాలే బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం తల్లిపాలు ఎంతో అవసరమని, కనీసం ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం వరకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. తల్లిపాలు అందించడం ప్రతి బిడ్డ హక్కు అని, ప్రతి తల్లి తన మాతృత్వ బాధ్యతను గుర్తించి పిల్లలకు తల్లిపాలు అందించాలని కోరారు.

తల్లులు తీసుకునే పోషకాహారం ద్వారానే స్వచ్ఛమైన పాలు బిడ్డలకు అందుతాయని, దీంతో పిల్లలు ఆరోగ్యంగా, దృఢంగా ఎదుగుతారని తెలిపారు. బలమైన బాల్యానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు.

ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తల్లులను ప్రోత్సహించి, ప్రతి శిశువుకు తల్లిపాలు అందేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. తల్లులందరికీ ప్రపంచ తల్లి పాల వారోత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో అదరపు కలెక్టర్ నగేష్

డీ డబ్ల్యూ హేమ భార్గవి, డిసి.హెచ్.ఎస్ శివదయాల్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, ఏ ఎం ఓ రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గణేశ్వర్, తదితరులు పాల్గొన్నారు

## నర్మెటలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు....



**నంగునూర్, అక్షిత ప్రతినిధి:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో సర్పంచ్ శనిగరం స్వాతి బాబు అధ్యక్షతన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, మాట్లాడతు గర్భిణీ దశ నుండి రెండు సంవత్సరములకు గల వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి చెప్పరూ ,బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు కేవలం 6 నెలల వరకు తల్లిపాలు తాగించడం ఎలాంటి ఇతర పానీయాలు ఇవ్వకూడదని అంశంపై మరియు ఆరు నెలల నిండిన తర్వాత అనుబంధ ఆహారము మొదలుపెట్టి రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగించాలనే అవగాహన కల్పించడం జరిగింది. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతలపై కూడా అవగాహన కల్పించారూ మరియు బిడ్డను ప్రతినెల హైట్ వెయిట్ తీసుకోవాలి అని పలు అంశాలపై అవగాహన కల్పించారు. 6నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేసారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ స్వాతి బాబు వార్డు సభ్యులు, పుర్ర రాజు, ఆకుల భారతి గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ రెడ్డి , బాలల సంరక్షణ అధికారి రమేష్, డాక్టర్ శివకిషోర్ హెల్త్ అసిస్టెంట్ లింగం ఏ ఎన్ యం లు స్వరూప , అశ్వినీ, రేణుక లు అంగన్వాడీ టీచర్స్ విజయ, ఉత్తర, తల్లులు గ్రామ పెద్దలు మరియు వి వో ఏ మౌనిక లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఆందోల్ మైసమ్మ ముగింపు ఉత్సవాలు



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మండలం, దండు మాల్కపురం గ్రామ పరిధిలోని శ్రీ ఆందోల్ మైసమ్మ 21వ బోనాల ఉత్సవాలు భాగంగా మూడవరోజు శ్రీ ఆందోల్ మైసమ్మ దేవాలయంలో ముగింపు ఉత్సవాలలో భాగంగా సోమవారం గణపతి పూజ, పూర్ణాహుతి,అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహక అధికారి సల్వాది మోహన్ బాబు మాట్లాడుతూ.. ఈ ఉత్సవాలకు సహకరించిన అన్ని ప్రభుత్వ శాఖ అధికారులకు, ఆలయ సిబ్బందికి, గ్రామ ప్రజలకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఈ సంవత్సరము ఆందోళన మైసమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందారాని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆందోళన మైసమ్మ దేవాలయం చైర్మన్ కంచర్ల అశ్విని రెడ్డి,సంతోష్ మాత దేవాలయ కార్యనిర్వాహక అధికారి అలుగుబెల్లి సత్తిరెడ్డి, ఆందోల్ మైసమ్మ, దేవాలయ డైరెక్టర్లు, ధర్మకర్తల మండలి సభ్యులు ఈడుదుల బాబు, బేతాళ నరసింహ, సిద్దిపేట ఆనందరెడ్డి, వెంకిర్యాల శివ, బాలగోని శ్రీకాంత్ గౌడ్, బొంతల యువరాజ్, మన్నే మహేందర్ రెడ్డి, దౌడీ రాజేష్ పన్నాల, మహేందర్ రెడ్డి, ధేప రాజీవ,పంతంగి రమేష్, జొన్నగంటి దాసు,చిట్టెంపల్లి సబిత, వల్లూరి శివప్రసాద్ శర్మ, గ్రామ ప్రముఖులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐఎన్టీయూసీ పోరాట ఫలితమే

### సింగరేణికి పీ.కే ఓసి-2 డీప్ సైడ్ బొగ్గు బ్లాక్ కేటాయింపుపై

### తీగల క్రాంతి కుమార్



**సత్తుపల్లి, అక్షిత న్యూస్ :** మణుగూరు ప్రాంతంలోని పీ.కే ఓసి--2 డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించడం కార్మికుల ఐక్యతకు, పోరాటానికి దక్కినవిజయమనిసత్తుపల్లిపట్టణానికి చెందిన ఐఎన్టీయూసీ జాయింట్ జనరల్ కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఆగస్టు 1న వేలాది మంది కార్మికులతో సింగరేణి వ్యాప్తంగా చేపట్టిన ఉద్యమ ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు.గతంలో తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించాలని డాక్టర్ బి. జనక్ ప్రసాద్ నేతృత్వంలో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేయగా, గత నెలలో కేంద్ర ప్రభుత్వం ఆ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అనంతరం పీ.కే ఓసి డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను కూడా సింగరేణికే అప్పగించాలని కోరుతూ, సంస్థకు కలిగేప్రయోజనాలు,కేటాయించకపోతేఎదురయ్యే నష్టాలను వివరించడంతో కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందన్నారు.ఈ కేటాయింపుతో వేలాది మంది కార్మికుల ఉద్యోగ భద్రత మరింత బలపడటంతో పాటు, స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగఅవకాశాలులభిస్తాయన్నారు. మణుగూరు ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రంగా మారేఅవకాశం ఉందన్నారు. తెలంగాణలోనిఅన్నిబొగ్గుబ్లాక్‌లను సింగరేణి సంస్థకే కేటాయించే వరకు ఐఎన్టీయూసీ ఉద్యమాన్ని కొనసాగిస్తుందని, సింగరేణిసంస్థ బలోపేతం, కార్మికుల హక్కుల పరిరక్షణ, హక్కుల సాధన కోసం యూనియన్ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని తీగల క్రాంతి కుమార్ స్పష్టం చేశారు.ఈ విజయాన్ని పురస్కరించుకొని జనక్ ప్రసాద్ కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

## కొత్తూరుకు కొత్త కళ

### రూ.50 లక్షలతో మున్సిపాలిటీలో 53 ఐమాక్స్ లైట్లు ప్రారంభించిన

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** కొత్తూరు మున్సిపాలిటీకి కొత్త కళ వచ్చిందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం కొత్తూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా ఆయా వార్డుల పరిధిలోని తిమ్మాపూర్,స్టేషన్ తిమ్మాపూర్ అక్కివేనిగూడ, కుమ్మరిగూడ,కొత్తూరు, కొత్తూరు తండాలలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రధాన చౌరస్తాలు,రద్దీ ప్రాంతాలలో హైమాస్ట్ లైట్లు అందుబాటులోకి రావడంతో కాలనీలలో చీకటి సమస్యలు తొలిగిపోతాయని,రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే ప్రజలకు మరియు వాహనదారులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు.కొత్తూర్ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని,ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాహితి రెడ్డి,సీఐ నాగార్జున రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్, మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, సర్పంచ్ కొమ్ము కృష్ణ,మాజీ ఎంపిటిసి రాజేందర్ గౌడ్,మాజీ సర్పంచులు ఏనుగు జనార్దన్ రెడ్డి,జగన్, నందిగామ మండల అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్,మాజీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్, సీనియర్ నాయకులు కమ్మరి జనార్దన్ చారి,ఇందూరి శ్రీనివాస్,పీర్ల గూడెం మహేష్ గౌడ్,గోవిందు నాయక్,భరత్ గౌడ్, తుప్పర రమేష్,చింత సాయి తేజేశ్వర్,కోస్గి మహేష్,కోస్గి కుమార్,కూన శివ కుమార్ గౌడ్,కోస్గి బాలు,కోస్గి దశరథ్,చిలకమర్రి నరసింహ,పాశం కృష్ణ,వెంకటయ్య, జితేందర్ రెడ్డి,శివ, కొండ రెడ్డి సుమన్,తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల నేతన్న అద్భుతం

### రెండు గంటల 50 నిమిషాల్లోనే అగ్గి పెట్టెలో పట్టే పట్ట చీర వేసి మడతపెట్టిన నేతన్న హరిప్రసాద్

**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ సాంప్రదాయ మగ్గంపై చేనేత చీరను నేసి కేవలం 2 గంటల 50 నిమిషాల్లో పూర్తి చేశారు. అనంతరం అదే చీరను అగ్గిపెట్టెలో ఇమిడేలా మడిచి వినూత్న ప్రతిభను కనబరిచారు. ఈ విశిష్ట ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా సిరిసిల్ల నేతన్నల నైపుణ్యాన్ని జాతీయ, అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పేందుకు ప్రయత్నం చేసినట్లు చేనేత కళాకారుడు హరి ప్రసాద్ పేర్కొన్నారు.

భారతీయ చేనేత వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. సాంప్రదాయ చేనేత మగ్గంపై కేవలం 210 నిమిషాల్లో.. అంటే మూడు గంటల ముప్పై నిమిషాల్లోనే ఐదున్నర మీటర్ల పొడవు, 45 అంగుళాల వెడల్పు గల పూర్తి చేనేత చీరను ప్రత్యక్షంగా నేసేందుకు ఏడాది నుండి ప్రాక్టీస్ చేసినట్లు తెలిపారు.







సహజంగా రెండు నుండి మూడు రోజులు పట్టే చీరను మూడున్నర గంటల్లో నేసేందుకు సోమవారం ప్రయత్నం చేశాడు. అయితే కేవలం 2 గంటల 50 నిమిషాల్లోనే (170 నిమిషాలు) చీరను నేసి అగ్గిపెట్టెలో మడిచి అనుకున్న లక్ష్యాన్ని ముందుగానే పూర్తి చేశారు. ఈ చీరను డాక్యుమెంట్ గా రూపొందించి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డుకు పంపిస్తున్నట్లు హరిప్రసాద్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఇంత తక్కువ సమయంలో ఇలాంటి చీరను ఎవరూ నేయలేదని.. తప్పకుండా తనకు రికార్డులో స్థానం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 12 సెంటీమీటర్ల పొడవు, 6.5 సెంటీమీటర్ల వెడల్పు, 2.5 సెంటీమీటర్ల ఎత్తు గల అగ్గిపెట్టెలో ఇమిడేలా ప్రదర్శించారు. ఈ ప్రదర్శన భారతీయ చేనేత సంప్రదాయ గొప్పతనాన్ని, తెలంగాణ చేనేత కళాకారుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రతిబింబించ నుందని చెప్పారు. అనంతరం సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ కళా చక్రపాణి పద్మశాలి సంఘం అధ్యక్షులు దూడం శంకర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మండల సత్యం బొల్లి రామ్మోహన్ స్థానిక కౌన్సిలర్ నాగరాజు మరియు కౌన్సిలర్ నీరజ పూర్ణచందర్ సూర దేవరాజు కలీం తదితరులు హరి ప్రసాద్ ను అభినందించారు.

# ప్రభుత్వ ఉద్యోగాల సాధనే లక్ష్యంగా...

### ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం
### బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు.

**గద్వాల అక్షిత న్యూస్:** గద్వాలలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ లో డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధన లక్ష్యంగా (125) రోజుల ఉచిత ఫౌండేషన్ కోర్స్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులనీ ఆయన అన్నారు. జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన అభ్యర్థులు (డబ్ల్యు డబ్ల్యు. టీజీ బీసీ స్టడీ సర్కిల్. సి జి జి. గవర్నమెంట్ ఇన్.) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో జూలై 14.2026 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆగస్టు 18.2026 న విడుదల చేయనున్నట్లు, ఆగస్టు 20 నుంచి 24 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించి, ఆగస్టు 25 నుంచి కోచింగ్ ప్రారంభం కానుందని ఆయన వివరించారు.

అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, గ్రామీణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.00 లక్షల లోపు ఉండాలని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర




ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఈ ఫౌండేషన్ కోర్స్‌లో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4ఎ, బ్యాంకింగ్, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్, పోలీస్ రిక్రూట్‌మెంట్ తదితర రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలకు శిక్షణ అందించనున్నట్లు రాములు తెలిపారు. కోచింగ్ కాలంలో అభ్యర్థులకు ప్రతి నెల రూ.1,000 చొప్పున బుక్ ఫండ్, రవాణా భత్యంగా స్టైపెండ్ అందజేయనున్నట్లు తెలిపారు. మొత్తం సీట్లలో 75 శాతం బీసీ అభ్యర్థులకు, 25 శాతం ఇతర వర్గాల అభ్యర్థులకు కేటాయించనున్నట్లు రాములు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు ఇది మంచి అవకాశమని, అర్హులైన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 08546-293022, 9908560268 ఫోన్ నంబర్ల లో సంప్రదించాలనీ రాములు తెలిపారు.

## ఎంపీడిఓ కార్యాలయంలో మండల స్థాయి సమీక్షా సమావేశం



**చిన్నంబావి, అక్షిత న్యూస్:** చిన్నంబావి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జలసిరి కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయడం, అరుతడి (ప్రత్యామ్నాయ) పంటల సాగును ప్రోత్సహించడంపై అధికారులు చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీపీఓ రఘునాథ్ రెడ్డి, మండల ఎంపీడీవో ఆదర్శ గౌడ్ తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ రామస్వామి, ఏపీఓ ధనం జయరాజు ఉద్యానవన శాఖ అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా దేశభక్తిని, జాతీయ ఐక్యతను ప్రతి ఇంటికి చేరవేసే మహత్తర ఉద్యమం : వనపల్లి శ్రీనివాస్ రెడ్డి



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, ఆగస్టు 2:** "హర్ ఘర్ తిరంగా" దేశభక్తిని, జాతీయ ఐక్యతను ప్రతి ఇంటికి చేరవేసే మహత్తర ఉద్యమమని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకునే గొప్ప అవకాశమని వనపల్లి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న "హర్ ఘర్ తిరంగా -- ఘర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎల్బీ నగర్ నియోజకవర్గంలోని గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని సిండికేట్ బ్యాంక్ కాలనీలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాశ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో కార్యక్రమ నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి (అర్బన్) జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కృష్ణ ప్రకాష్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు, హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ రాజేంద్రప్రసాద్, కో-కన్వీనర్ శ్రవణ్ గౌడ్, జిల్లా బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సృజన యాదవ్, పారంద సాయి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వనపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పిలుపు మేరకు ఆగస్టు 11 నుంచి 13వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా విస్తృతంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. బూత్ స్థాయి కార్యకర్తల నుంచి జాతీయ స్థాయి నాయకుల వరకు అందరూ సమన్వయంతో పనిచేసి ప్రతి కుటుంబాన్ని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. అనంతరం బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బూత్‌వారీ కార్యాచరణను రూపొందించి, ప్రతి ఇంటికి జాతీయ జెండా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కన్వీనర్లు, కో-కన్వీనర్లు జెండాల పంపిణీ, ప్రజల్లో అవగాహన కల్పించడం, స్థానిక స్థాయిలో కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు సుధాకర్ రెడ్డి, సీనియర్ సిటిజన్లు, వివిధ కాలనీల ప్రతినిధులు, బీజేపీ వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పూర్తి స్థాయిలో పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# భవిష్యత్తులో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు కుడికిల్లలో నూతన బోర్

## ప్రజలకు తాగునీరు అందించడం మా ప్రథమ బాధ్యత

## సర్పంచ్ జూపల్లి రఘుపతిరావు




**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్ మండల్ కుడికిల్ల గ్రామ ప్రజల తాగు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో ఎలాంటి నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసు కున్నారు. కుడికిల్ల సర్పంచ్ జూపల్లి రఘుపతిరావు వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికతో గ్రామంలో నూతనంగా అదనపు బోర్ వేయించారు. గ్రామ జనాభా రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రస్తుతం ఉన్న నీటి వనరులు సరిపోకపోవచ్చనే ఆలోచనతో ఈ బోరును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జూపల్లి రఘుపతిరావు మాట్లాడుతూ, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం మా ప్రథమ బాధ్యత. వేసవి వచ్చే లోపే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలనే సంకల్పంతో ఈ బోరు వేయించాం. ఇప్పుడు వేసిన ఈ అదనపు బోర్ ద్వారా గ్రామ ప్రజలకు తగినంత నీరు అందుబాటులో ఉంటుంది. కుడికిల్ల గ్రామాల్లో భవిష్యత్తులో ఎప్పటికీ నీటి సమస్య రాకుండా చూసే బాధ్యత మాది అని గ్రామ ప్రజానీకానికి తెలియజేశారు. గ్రామంలో తలెత్తే ఏ చిన్న సమస్యకైనా ముందుగానే స్పందించి పరిష్కారం చూపే సర్పంచ్ చొరవను చూసి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుడికిల్ల ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్, గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్నేహం చావదు, జ్ఞాపకాలు చెరగవు

## చిన్ననాటి స్నేహితుని జ్ఞాపకార్థం చెన్నకేశవ బృందం సేవా కార్యక్రమం



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలంలో 22/07/2026 బుధ వారం కీర్తిశేషులు పాలడుగుల శేఖర్ మరణించాడు వారి స్నేహితులు చెన్నకేశవ కాలనీ స్నేహం అంటే ఒక అందమైన అనుబంధం. రక్త సంబంధం లేకపోయినా ప్రాణానికి ప్రాణంగా ఉండే బంధం. అలాంటి చిన్ననాటి స్నేహితుడు అకాల మరణం చెందడంతో చెన్నకేశవ బృందం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ఆ విషాదాన్ని సేవగా మార్చాలని, ఆ మిత్రుని జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపాలని బృందం నిర్ణయించింది. స్నేహితుని జ్ఞాపకార్థంగా చెన్నకేశవ కాలనీలో 5 బెంచీలను ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. అలాగే శేఖర్ తల్లి బొందమ్మ కు 6000/- ఆర్థిక సహాయం అందించారు. కాలనీలో వృద్ధులు కూర్చుని ముచ్చటించుకునేందుకు, పిల్లలు ఆటలాడి విశ్రాంతి తీసుకునేందుకు, ప్రజలు కొంతసేపు కూర్చునేందుకు ఈ బెంచీలు ఉపయోగపడతాయి. ప్రతిసారీ ఎవరైనా ఈ బెంచీపై కూర్చున్నప్పుడు ఆ మిత్రుని గుర్తు చేసుకుంటారనే భావనతో ఈ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చెన్నకేశవ బృంద సభ్యులు బ్యాగరీ మల్లేష్ మాట్లాడుతూ, మా స్నేహితుడు శరీరంతో మా మధ్య లేకపోయినా, ఆయన ప్రేమ, ఆయన చిరునవ్వు, ఆయన మంచితనం మా గుండెల్లో ఎప్పటికీ సజీవంగా ఉంటాయి. ఆయన పేరుతో సమాజానికి మంచి చేయడమే మాకు నిజమైన నివాళి. ఈ బెంచీల ద్వారా ఆయన పేరు కాలనీలో ఎప్పటికీ నిలిచి ఉంటుంది అని భావోద్వేగంగా తెలిపారు. మనిషి వెళ్ళిపోవచ్చు కానీ, ఆయన మిగిల్చిన జ్ఞాపకాలు, ఆయన చేసిన మంచి మాత్రం ఎప్పటికీ నిలుస్తుంది అనే గొప్ప సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా బృందం అందించింది. ఈ మానవీయ కార్యక్రమాన్ని చూసిన కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ, చెన్నకేశవ బృందం చొరవను అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్యాగరి మల్లేష్, శంకర్, జె. మల్లేష్, బాలరాజు, శీను, నరేష్, శివ, శేఖర్ తో పాటు స్నేహితులు, కాలనీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వికారాబాద్‌లోని 'మై భారత్ (మేరా యువ భారత్)' ఆధ్వర్యంలో 'నషా ముక్త్ యువ వికసిత్ భారత్'




## జిల్లాస్థాయిపోటీలువిజయవంతంగా నిర్వహించబడ్డాయి.

**వికారాబాద్ :అక్షిత బ్యూరో:** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'మై భారత్ (మేరా యువ భారత్)', వికారాబాద్ సంస్థ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' కింద జిల్లా స్థాయి పోటీలు వికారాబాద్‌లోని మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో విజయవంతంగా నిర్వహించ బడ్డాయి. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన మరియు క్రీడల అధికారి నరసింహులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. 'మై భారత్' డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి స్నేహల్ బసుత్కర్ మరియు మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ ఖలీల్ ఈ కార్యక్రమానికి హాజరై, మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణ ఉద్యమంలో యువత చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు.వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద కార్యకర్తలు మరియు యువత జిల్లా స్థాయి పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ క్రింది విభాగాలలో పోటీలు నిర్వహించబడ్డాయి: జానపద సంగీత పోటీ, నృత్య పోటీ, లఘుచిత్రం / రీల్ పోటీ, నుక్కడ్ నాటకం / మైమ్ స్లామ్ పోయెట్రీ పోటీ, వాదోపవాదాలు / వక్తృత్వ పోటీ, చిత్రలేఖన పోటీ, నినాద రచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలు యువత తమ సృజనాత్మకతను ప్రదర్శించడానికి, మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడానికి, మరియు 'నషా ముక్త్ భారత్ అభియాన్' సందేశాన్ని బలోపేతం చేయడానికి ఒక వేదికను అందించాయి.

పాల్గొన్న వారందరి అద్భుతమైన ప్రదర్శనలను ప్రముఖులు ప్రశంసించి, విజేతలను అభినందించారు. ప్రతి పోటీలో ప్రథమ స్థానం పొందిన విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలలో వికారాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించడానికి ఎంపిక చేశారు.

డీన్, అధ్యాపక బృందం, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద కార్యకర్తలు మరియు పాల్గొన్న వారి సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని 'మై భారత్' (మేరా యువ భారత్), వికారాబాద్ బృందం సమర్థవంతంగా సమన్వయం చేసింది.

మై భారత్ వాలంటీర్లు మరియు సిబ్బంది శ్రీ దాసరి శ్రీశైలం, ఉపాధ్యాయుడు రఘునాథ్, కె.రవి, కాజా కరీముద్దీన్, కార్తీక్, మరియు అర్చన సింహాద్రి సమన్వయం చేయడంలో చురుకుగా పాల్గొన్నారు.

# భారతదేశపు తొలి పరిశ్రమ-విద్యాసంస్థల అణు సాంకేతిక శిక్షణ కార్యక్రమం అనుగ్యాన్ ప్రారంభం

**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** భారతీయ సాంకేతిక విద్యాసంస్థ (ఐఐటీ) హైదరాబాద్, క్రిమ్సన్ ఎనర్జీ ఎక్స్‌పర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో దేశంలోని తొలి పరిశ్రమ--విద్యాసంస్థల భాగస్వామ్య అణు సాంకేతిక శిక్షణ కార్యక్రమం అనుగ్యాన్ -- న్యూక్లియర్ టెక్నాలజీ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ను సోమవారం ప్రారంభించారు. వేగంగా విస్తరిస్తున్న భారత పౌర అణుశక్తి రంగానికి అవసరమైన నైపుణ్యం కలిగిన ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులను తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యా, పరిశ్రమ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. మూడు నెలల పూర్తిస్థాయి రెసిడెన్షియల్ కోర్సుగా రూపొందించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యా బోధన, పరిశ్రమ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి, విధుల్లో వెంటనే చేరగల సాంకేతిక నిపుణులను తయారు చేయనున్నారు. ఈ కోర్సులో రియాక్టర్ ఫిజిక్స్, థర్మల్ హైడ్రాలిక్స్, రేడియేషన్ షీల్డింగ్, స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, అణు భద్రత, క్వాలిటీ అష్యూరెన్స్, ఇంజినీరింగ్ డిజైన్, అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు నిబంధనల అనుసరణ, సిమ్యులేటర్ ఆధారిత శిక్షణ వంటి అత్యాధునిక అంశాలను బోధించనున్నారు. కోర్సు విజయవంతంగా పూర్తిచేసిన వారికి ఐఐటీ హైదరాబాద్, క్రిమ్సన్ ఎనర్జీ ఎక్స్‌పర్ట్స్ సంయుక్త ధ్రువీకరణ పత్రం అందజేయనున్నారు.





భారత ప్రభుత్వం 2047 నాటికి దేశ అణుశక్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న సుమారు 8.8 గిగావాట్ల నుంచి 100 గిగావాట్ల కు పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో, ఆ అవసరాలకు అనుగుణంగా స్వదేశీ నైపుణ్య మానవ వనరులను సిద్ధం చేయడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించనుంది. అలాగే, ఇంజినీరింగ్ పట్టభద్రులు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, పరిశ్రమ నిపుణులు, ఈపీసీ సంస్థలు, అణు పరిశ్రమకు అవసరమైన పరికరాల తయారీ సంస్థలకు చెందిన ప్రతినిధులు ఈ శిక్షణ ద్వారా ప్రత్యేక నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం లభించనుంది. ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి మాట్లాడుతూ, దేశ స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్తుకు సిద్ధమైన నిపుణులను తీర్చిదిద్దేందుకు అనుగ్యాన్ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. విద్యా నైపుణ్యాన్ని పరిశ్రమ అనుభవంతో సమన్వయం చేస్తూ దేశ ఇంధన భద్రత, సాంకేతిక స్వావలంబనకు తోడ్పడే ఇంజినీర్లను తయారు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. క్రిమ్సన్ ఎనర్జీ ఎక్స్‌పర్ట్స్ న్యూక్లియర్ విభాగం అధ్యక్షుడు కమోడోర్ (రిటైర్డ్) ఆర్.డి. మానే మాట్లాడుతూ, అణు రంగంలో నాణ్యత ప్రమాణాలు, భద్రతా నిబంధనల అనుసరణకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తేలియాడే అణు విద్యుత్ కేంద్రాల వంటి భవిష్యత్ సాంకేతికతలకు అనుగుణంగా పనిచేయగల నిపుణులను తయారు చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. కాగా, భారత్ ఇన్నోవేట్--2026 సందర్భంగా ఫ్రాన్స్‌లో కుదిరిన అవగాహన ఒప్పందం ఆధారంగా ఐఐటీ హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ డిజైన్ ఎక్సలెన్స్ ఇన్ న్యూక్లియర్ ఇంజినీరింగ్ స్థాపనకు కూడా ఈ కార్యక్రమం పునాది వేస్తుందని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కేంద్రం అణు ఇంజినీరింగ్ రూపకల్పన, డిజిటల్ సిమ్యులేషన్, సంయుక్త పరిశోధనలకు కీలక వేదికగా నిలవనుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలకు చెందిన ప్రతినిధులతో అనుగ్యాన్ తొలి బ్యాచ్ సోమవారం ప్రారంభమైంది.

# హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ ముమ్మర కసరత్తు

### పోటీలో అనేక మంది ఉన్నా ప్రధానంగా నలుగురు బలమైన అభ్యర్థులపై దృష్టి






**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** వచ్చే మార్చిలో జరగనున్న హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో పాటు భారతీయ జనతా పార్టీ కూడా ఈ స్థానాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది.

ప్రస్తుతం బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ప్రజా సమస్యలపై చురుకుగా కనిపించలేదనే అభిప్రాయం పట్టభద్రులలో పెరుగుతోందని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో బీఆర్ఎస్ అధికార అహంకారం, భారీ ధనబలం మధ్య కూడా బీజేపీ సిద్ధాంతపరమైన నాయకుడు ఎన్. రామచందర్ రావు స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారని, ఈసారి పరిస్థితులు మారాయని పార్టీ నాయకులు భావిస్తున్నారు.

యువత, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలు ప్రధాన చర్చగా మారిన నేపథ్యంలో ప్రజల్లో గుర్తింపు కలిగిన, సిద్ధాంతపరంగా స్పష్టత ఉన్న, బలంగా మాట్లాడగల నాయకుడిని ఎంపిక చేయాలనే అభిప్రాయం బీజేపీ అంతర్గత వర్గాల్లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో పార్టీ స్వరాన్ని బలంగా వినిపించే నాయకత్వం అవసరమనే చర్చ కొనసాగుతోంది.

#### ప్రధానంగా వినిపిస్తున్న నలుగురు బలమైన అభ్యర్థులు

#### నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజా జీవితంలోకి వచ్చిన ఆయన 2007, 2011 టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప తేడాతో పరాజయం పాలయ్యారు. 2014, 2018లో షాద్‌నగర్ నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. 2023 ఎన్నికల్లో పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేశారు.

విద్యార్థి దశ నుంచే ఏబీవీపీ నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన ఆర్ఎస్ఎస్ భావజాలంతో బీజేపీలో పోరాట నాయకుడిగా ఎదిగారు. తెలంగాణ విమోచన యాత్ర ద్వారా సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా జరపాలనే అంశాన్ని ఢిల్లీ స్థాయికి తీసుకెళ్లిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. విద్యా రంగంలో అనేక విద్యాసంస్థలను స్థాపించి వేలాది మందికి విద్య అందించడంతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థలతో విస్తృత సంబంధాలు కలిగి ఉన్నారు.

#### డాక్టర్ పి. భాస్కరయోగి

రచయిత, వక్త, కాలమిస్ట్‌గా గుర్తింపు పొందిన ఆయన హిందుత్వ, జాతీయవాద భావజాల ప్రచారంలో చురుకుగా ఉన్నారు. జూనియర్ కళాశాల ఉపన్యాసకుడిగా, ఉపాధ్యాయ వర్గాలతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారు. ఆర్ఎస్ఎస్ మరియు అనేక ఆధ్యాత్మిక సంస్థలతో అనుబంధం ఆయనకు ప్రత్యేక బలం.

#### డాక్టర్ ఎస్. మల్లారెడ్డి

బీజేపీ సీనియర్ నాయకుడైన ఆయన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. రాష్ట్ర స్థాయి బీజేపీ నాయకత్వంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటం ఆయనకు బలంగా కనిపిస్తోంది.

#### సుధాకర్ రావు

కొల్లాపూర్ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆయన విద్యుత్ శాఖలో పనిచేసి ఉద్యోగ సంఘ నాయకుడిగా గుర్తింపు పొందారు. ఉద్యోగ వర్గాల్లో అనుభవం, సంఘ పరిచయం ఆయనకు అనుకూల అంశాలుగా భావిస్తున్నారు.

ఇవే కాక మరికొంతమంది నాయకుల పేర్లు వినిపిస్తున్నప్పటికీ, పార్టీతో సుదీర్ఘ అనుబంధం, సిద్ధాంతపరమైన నిబద్ధత, ప్రజల్లో గుర్తింపు, ఉద్యమ అనుభవం వంటి అంశాలకే ఈసారి అధిక ప్రాధాన్యం దక్కే అవకాశముందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

#### ప్రజల్లో గుర్తింపు ఉన్న నాయకుడే కావాలనే డిమాండ్

ప్రస్తుతం బీజేపీకి శాసనమండలిలో ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నప్పటికీ, ప్రజా వేదికలపై బలంగా వినిపించే నాయకత్వం ఇంకా అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నిరుద్యోగం, విద్య, యువత సమస్యలను సమర్థంగా ప్రస్తావించే, వామపక్ష మేధావుల వాదనలను ఎదుర్కోగల మేధోసామర్థ్యం కలిగిన అభ్యర్థి అవసరమని కిందిస్థాయి కార్యకర్తలు కోరుతున్నారు.

#### కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యూహాలు

కాంగ్రెస్ పార్టీ బీసీ అభ్యర్థిని పరిశీలిస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ మాత్రం ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ధనబలం వినియోగించినా గెలవాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

#### బీజేపీకి సిద్ధాంత ఆధారిత అవకాశం?

గతంలో తక్కువ ధనబలంతోనే రామచందర్ రావు బలమైన పోటీ ఇచ్చారని, ఈసారి ప్రజా వ్యతిరేకత, యువతలో మారుతున్న రాజకీయ భావజాలం, సిద్ధాంతపరమైన ఓటు సమీకరణం కలిసి వస్తే బీజేపీకి అనుకూల పరిస్థితులు ఏర్పడవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మొత్తంగా హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ లిలి"డబ్బు, బయటి ప్రభావం కంటే సిద్ధాంతం, గుర్తింపు, ప్రజా స్వరం" అనే ఫార్ములాపై ముందుకు వెళ్లే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పార్టీ కార్యకర్తలు, కిందిస్థాయి నాయకత్వం కూడా ఇదే అభిప్రాయాన్ని బలంగా వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ తుది అభ్యర్థి ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ల చోరీ ప్రాంతాన్ని పరిశీలించిన బీజేపీ నాయకులు



**చిన్నంబావి, అక్షిత న్యూస్:** చిన్నంబావి మండల కేంద్రంలోని పెద్దమారూర్ గ్రామ సమీపంలోని చిన్నమారూర్ పేస్టు--2 పంప్‌హౌస్, ఫేజ్--1 పంప్‌హౌస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తుతెలియని దుండగులు కాపర్ వైర్లను చోరీ చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.రాష్ట్ర బీజేపీ నాయకులు కురువ చిన్న మల్లయ్య, గూడెం సర్పంచ్ కొత్త వెంకటరెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారెడ్డి, మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య, మండల జనరల్ సెక్రెటరీ సంపత్ కుమార్, మేకల చెన్నయ్య మండల ఉపాధ్యక్షుడు గణేష్ రెడ్డి మద్దిలేటి తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీలకు పాల్పడిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.సమస్యపై అధికారులు స్పందించకపోతే మండల వ్యాప్తంగా ఆందోళన చేపట్టి కార్యాలయాలను ముట్టడిస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు.

# రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం కార్యదర్శిగా నీల రవీందర్

### నీల రవీందర్‌ను సన్మానించిన ఆర్యవైశ్యులు



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం నూతన రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన నీల రవీందర్‌కు రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందె సురేష్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీల రవీందర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియ జేశారు. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన ఆయన ఆర్య వైశ్య యువతను సంఘటితం చేస్తూ, వారి సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం మరింత చురుకుగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ, మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు అనుమారి మురళీధర్, అవోపా రాష్ట్ర నాయకులు పెంద్యాల జగదీశ్వర్, నాయకులు గుడిపాటి విజయ్ కుమార్, జవాద యశ్వంత్ రాజ్, గడ్డ ఆంజనేయులు, వేముల ఆనంద్ బాబు, పెనుగొండ అశోక్ తదితరులు పాల్గొని నీల రవీందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శిగా తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఆర్యవైశ్య యువజన సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువత సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని నీల రవీందర్ తెలిపారు..

# ఐక్యతకు నిదర్శనం పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్

### పులిపాటి నగర్‌లో ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు




**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఐక్యత ఆప్యాయతలకు నిదర్శనం పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అని అసోసియేషన్ చైర్మెన్ పులిపాటి విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ పులిపాటి ప్రసాద్ అన్నారు. ఆదివారం రాత్రి తన నివాస ఆవరణలో జరిగిన స్నేహితుల దినోత్సవ వేడుకలు అంబరానంటాయి.ఈ సందర్భంగా డాక్టర్ పులిపాటి ప్రసాద్ మాట్లాడుతూ మీ అందరి ఆదరభిమానాలు ఉన్నంత వరకు ఆప్యాయత అనురాగాలతో పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధిలో ముందంజలో ఉందని ఆయన అన్నారు. వేదికలు ఏమైనప్పటికీ మీరు చూపుతున్న ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని అందుకే ఫ్రెండ్షిప్ డే గా పరిగణించబడుతుందనీ ఆయన అన్నారు. భవిష్యత్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అంశంలో అందరి విజ్ఞప్తి మేరకు తాను పోటీ చేసేందుకు నిర్ణయం ఆనాడు తీసుకుంటానని ప్రస్తుతం తన విద్యాసంస్థలతో లక్షలాదిమంది విద్యార్థులకు ఉన్నత విద్యార్థులుగా తీర్చి దిద్దడం జరిగిందని రాబోవు రోజుల్లో ప్రజాసేవకు అంకితమవుతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పట్నాయక్ వెంకటేశ్వరరావు మాధవరావు శ్రీనివాసరావు పవన్ వీరభద్రం అనంతరెడ్డి అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షులు దిలీప్ చౌదరి యోగేష్ ఖమ్మం పౌర సమితి జనరల్ సెక్రటరీ ఖాసీం కార్యదర్శి బుగ్గవరపు సతీష్ గోళ్ల రాధాకృష్ణ మూర్తి గుమ్మడవెల్లి శ్రీను వరప్రసాద్ వీరభద్రం బుర్ల పుల్లారావు కొల్లా రామారావు మజీదు ఎండి హాకీమ్ హబీబ్ మంత్రి ప్రగడ జగన్మోహన్రావు బద్రునాయక్ ఉపేందర్ ప్రవీణ్ కృష్ణ పురుషోత్తం కాజా వెంకటేశ్వరరావు మాశెట్టి ప్రసాద్ ఉష సీనియర్ జర్నలిస్టులు షేక్ జానిపాషా టిఎస్ చక్రవర్తి భద్రం తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించిన కిట్స్ విద్యార్థిని అంజలి

**విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి**

**కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ**



**కోదాడ అక్షిత ప్రతినిధి:** కోదాడ కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి నికి ఖమ్మం లో నిర్వహించిన నేషనల్ ఛాంపియన్షిప్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో బీటెక్ ఎలక్ట్రికల్ మరియు ఎలక్ట్రానిక్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎం. అంజలి బంగారు పతకం సాధించారు . ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిన విద్యార్థినిని కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి కళాశాలకు తల్లిదండ్రులకు సొంత గ్రామానికి మంచి పేరు సంపాదించాలని అన్నారు ఈ కార్యక్రమం లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ళపల్లి గాంధీ, అదేవిధంగా విభాగాధిపతి డాక్టర్ శివాజీ, విభాగాదిపతులు, అధ్యాపకులు, కరాటే శిక్షకులు మాధవి లత అభినందించారు.

## మచ్చలేని మహనీయుడు సున్నం రాజయ్య



**భద్రాచలం అక్షిత న్యూస్ :** ప్రజల సమస్యల పరిష్కారాలకు నిరంతరం పోరాడిన పోరాట యోధుడు, నిజాయితీతో కూడిన రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్యను ఆదర్శంగా తీసుకుని ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే ఆయనకు మనమిచ్చే నిజమైన ఘన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

సున్నం రాజయ్య ఆరో వర్ధంతి సందర్భంగా భద్రాచలం అంబేద్కర్ సెంటర్లోని రాజయ్య, కుంజా బొజ్జి స్తూపాల వద్ద సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి ముందు పార్టీ సీనియర్ నాయకులు జీఎస్ శంకర్ రావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం, మచ్చ వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య , ఏ.జే.రమేష్ లు సున్నం రాజయ్య స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సున్నం రాజయ్య అవినీతి మచ్చలేని నాయకుడిగా ప్రజలను అంటిపెట్టుకొని భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధి కోసం జీవితాంతం పోరాడారని కొనియాడారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో సైతం తన మాతృభాషలోనే గళమెత్తి ప్రభుత్వాన్ని నిలదీసిన నాయకుడు రాజయ్య అని అన్నారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీసే విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదే రాజయ్యకు మనమిచ్చే ఘన నివాళి అని అన్నారు.

ఈ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గ్రామపంచాయతీ ఫ్లోర్ లీడర్ బండారు శరత్ బాబు, జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగ, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకట రామారావు, సీనియర్ నాయకులు బిబిజి తిలక్, యం.రేణుక, 20వ వార్డు మెంబర్ ఇరప అనసూయ, పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, నకరికంటి నాగరాజు, ఉస్తేల జ్యోతి, అజయ్ కుమార్, జీవన జ్యోతి,ధనకొండ రాఘవయ్య,చాట్ల శ్రీను,కుంజ శ్రీనివాస్, చుక్క మాధవరావు, డి. కనక శ్రీ, ఎస్.డి.ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు..

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**196 అర్జీల రాక**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 196 అర్జీలు రాగా, సంబంధిత అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు.



**సద్వినియోగం చేసుకోవాలి**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 5 దరఖాస్తులు రాగా, సంబంధిత అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 4 దరఖాస్తులు రాగా, సంబంధిత అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు వెంటనే కేటాయించాలి

**జిల్లా కలెక్టర్కి టీజేఏ ఖమ్మం జిల్లా కమిటీ వినతి**



**ఖమ్మం/అక్షిత బ్యూరో:** అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు జి నాగ స్వామి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ కు వినతిపత్రం అంద చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.టీజేఏ జిల్లా అధ్యక్షులు నాగస్వామి మాట్లాడుతూ సమాజానికి సమాచారాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు సొంత ఇంటి కల నెరవేరేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు వివక్ష లేకుండా ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.గత రెండు దశాబ్దాలుగా (20 ఏళ్లుగా) పరిష్కారానికి నోచుకోకుండా పెండింగ్లో ఉన్న అర్హులైన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) డిమాండ్ చేసింది.ఈ మేరకు అర్హులైన ప్రతి విలేకరికీ తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. పెరుగుతున్న ధరల కాలంలో జర్నలిస్టులు ఇండ్ల అద్దెలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీజేఏ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నప్పటికీ జర్నలిస్టుల నిరీక్షణ ఇంకా కొనసాగుతూనే ఉందని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ పారదర్శకంగా ఇళ్ల స్థలాలు కేటాయించి వారి కుటుంబాలకు నివాస ధీమా కల్పించాలని టిజేఏ ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని జిల్లా యంత్రాంగాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా గౌరవ అధ్యక్షులు కొమ్మమూరు మణికుమార్ జిల్లా అధ్యక్షుడు జి నాగస్వామి జిల్లా కార్యదర్శి మత్తి రామకృష్ణ జిల్లా నాయకులు సయ్యద్ ఖాసీం ( అక్షిత తెలుగు దినపత్రిక) వాసం రాజేంద్ర ప్రసాద్ ( హైదరాబాద్ మిర్రర్) రాము రమేష్ సతీష్ సిహెచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## జీఎంపీఎస్ మహాసభలను విజయవంతం చేయాలి

**జి.ఎం.పి.ఎస్ జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు**



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చెంగిచెర్లలో ఆగష్టు 22,23,24 తేదీలలో జరగనున్న గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా జీఎంపీఎస్ అధ్యక్షుడు మద్దెపురం రాజు పిలుపునిచ్చారు.సోమవారం చౌటుప్పల్ పట్టణంలో రెవిన్యూ డివిజన్ స్థాయి ప్రాంతీయ సమావేశం కొండె శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించారు .ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు హాజరై మాట్లాడుతూ... గొర్రెలు,మేకల పెంపకందారులు తరతరాలుగా వృత్తి చేసుకుంటూ సమాజానికి పోషకాహారం అందిస్తున్నా,సామాజికంగా,ఆర్థికంగా,రాజకీయంగా వెనుకబడి ఉన్నారని అన్నారు.గత 30 సంవత్సరాలుగా జీఎంపీఎస్ గొర్రెల కాపరులను చైతన్యపరుస్తూ వారి హక్కుల కోసం పోరాడి అనేక ఫలితాలు సాధించిందని తెలిపారు.యాదాద్రి జిల్లాలో గొర్రెల కాపరులను ఐక్యం చేసి,రోడ్లపై జీవాలతో రాస్తారోకో చేసి,భూస్వాములు,పెత్తందారులను ఎదిరించి గొర్రెలు,మేకలకు ఉచితంగా మేత మేపుకునేలా 1016,559,64 జీవోలను తీసుకురావడంలో జీఎంపీఎస్ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు.జీవాలకు మందులు,పశు వుల డాక్టర్లను,మేత భూములను,తుమ్మ చెట్లపై హక్కులను,ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి ఎక్స్ గ్రేషియో,సబ్సిడీ రుణాలు కంటి వాటిని జీఎంపీఎస్ సాధించినట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మేము అధికారంలోకి వచ్చిన 100రోజుల్లో నగదు బదిలీతో గొర్రెల పంపిణీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తి అవుతున్నా అమలు చేయడం లేదన్నారు.ఈ ప్రభుత్వం వెంటనే అమలు చేయకపోతే జీఎంపీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నేపథ్యంలోనే జి.ఎం.పి.ఎస్ రాష్ట్ర 4వ మహాసభలు ఆగష్టు 22,23,24తేదీలలో చెంగిచెర్లలో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ మహాసభలో గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాలు రూపొందిస్తామని తెలిపారు.ఈ మహాసభలకు గొల్ల,కురుమలు,విద్యావంతులు,మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు నర్సింహ్మ,సహాయ కార్యదర్శి కొండె శ్రీశైలం,ఉపాధ్యక్షులు నారి వెంకటేష్,జిల్లా కమిటీ సభ్యులు భీమనబోయిన బాలరాజు,జెనిగల యాదయ్య,గాజుల అంజయ్య,నారి మల్లేశం,బుగ్గ లక్ష్మయ్య,గడగోటి జంగయ్య,అరిగె బీరప్ప, బెడిద రమేష్,మల్లేష్ పాల్గొన్నారు.